# కురిసివెలిసిన జడివాన

మాలతి ఏడేళ్లు నిండీనిండనిపిల్ల. పొడుగ్గాఉన్నా బొద్దుగా ఎర్రగా ఉంటుంది. స్కూల్లో ఆలస్యంగా చేర్చటంవల్ల అక్షరమాలను, నూరువరకూ అంకెలను ముగించింది. ఇప్పుడే తల్లి గుణింతాలు నేర్పుతున్నది. చురుకైన పిల్ల కనుక తల్లి నేర్పుతున్న పాటలు స్వరంతో కూడా పాడగలుగుతున్నది.

వెంకటలక్ష్మి పగటిభోజనం కాగానే చాపమీద పసిపిల్లను పడుకోబెట్టి, ముందర బొమ్మలబుట్టను కుమ్మరించి, మాలతిని ''పాపను ఆడించమ్మా'' అంటుంది.

"రోజు ఆడించాలా ?'' గునుస్తుంది మాలతి.

''నేను ఈ పత్రిక చదివేవరకూ ఆడించు. ఇంతలోకి పాపకు ఆకలేస్తుంది. పాలు తాగి పడుకుంటుంది. ఇంక నీవు చదువుకోవచ్చు, పాటలు పాడుకోవచ్చు. గంగవస్తే ఆమెతో ఆడుకోవచ్చు. సెలవు లిచ్చారుగా స్కూలుకు."

''ఆడుకునేటప్పుడు బిస్కట్లు ఇస్తావా ?"

''ఎందుకివ్వను ? నీకిచ్చే లంచంసంగతి మర్చిపోతానా ?" అంటుంది వెంకటలక్ష్మి.

ఇది రోజూ వాళ్ళకు అలవాటైన కార్యక్రమం.

ఆ రోజు వెంకటలక్ష్మి పత్రిక తిరగవేస్తుండగా "అమ్మగారూ కృష్ణయ్యకు ఆహారమేస్తారా'' అంటూ తట్టనెత్తినపెట్టుకుని మాలక్ష్మివచ్చింది.

"వద్దమ్మా, ఇవాళ వద్దులే, మరోసారి వచ్చినప్పుడు చూద్దాం. మళ్ళీ నీవు వస్తావుగా ? అప్పుడు వేయిస్తా''.

అంతలో మాలతి తల్లి దగ్గరకొచ్చి "ఏమిటమ్మా అవి ?" అడిగింది.

''అవి పప్పులు కావమ్మా, జీడిపప్పువస్తే తప్పకుండా తీసుకుంటా'' నన్నది.

"అవి పప్పులు కాకపోతే మళ్ళీ వచ్చినప్పుడు వేయిస్తానన్నావు ?"

"అవి చిన్న చిన్న చేపలు, గద్దలకు ఆహారంగా వేయిస్తూ ఉంటారు, అవి తింటాయి".

''అమ్మా, అవి నేనూ చూస్తా వేయించు. ఆ చిన్నచేపలు ఎట్లా ఉంటాయో నేను ఎప్పుడూ చూడలేదు'' మారాం చేసి తట్టను తీసుకువచ్చిన ఆమెను నాలు గిళ్ళ అవతలనుంచి పిలుచుకు వచ్చింది.

''వెయ్యమంటారా అమ్మా'' అడిగింది చేపలమనిషి.

''వెయ్యి. మా అమ్మాయి చూస్తుందట".

బుట్టమీద కప్పిన బట్ట తీయగానే చిన్న చిన్న చేపలు మిణుకు మిణుకు మంటూ కళ్ళు తిప్పుతూ తిరుగుతున్నాయి. వాటిని దోసెళ్ళతో తీసి నడివీధిలో పోసింది. "అమ్మా, రూపాయది వేసినాను. ఇంకో రూపాయది వెయ్యనా తల్లీ ?" అడిగింది.

మాలతే చెప్పింది "వెయ్యి ఇంకొకరూపాయది".

ఈ బుట్టలు కనబడగానే గద్దలు పిలవకుండానే వచ్చి చేపపిల్లలను తన్నుకు పోతాయి. ఆనాడు ఆ అమ్మి ''కృష్ణా ఆ-ఆ-ఆ'' అంటూ పిలిచింది. వెంటనే ఏభయి అరవయి గద్దలు గుంపుగావచ్చి చేపలను పదినిమిషాలలో తన్నుకుపోయి నోట కరచుకుని తినేశాయి. అవి తన్నుకుపోయేటప్పుడు చెదురుమదురుగా కొన్ని చిన్నచేపలు చిందరవందరగా అటూ ఇటూ పడ్డాయి. వాటిని ఏరి పక్కకు పడేసి డబ్బు తీసుకుని వెళ్ళిపోయింది మాలక్ష్మి.

మాలతి చేపలను రోడ్డుమీద పోసేవరకూ చూసింది. కాని గద్దలు ఎగురుతూ వచ్చి బతికిన చేపపిల్లలను నోటితో కరుచుకొని ఎత్తుకుపోతుంటే "అయ్యో! అయ్యో ! అమ్మా, అటుచూడు ఆ పిట్టలు ?" అరవటం మొదలుపెట్టింది.

చేపలయిపోగానే కొన్ని గద్దలు అటూ ఇటూ కొంచెంసేపు తిరిగి వెళ్ళి పోయాయి.

"అమ్మా, ఇంత చిన్నచేపలు ఎక్కడ దొరుకుతాయి ?" అడిగింది. మాలతికి చిన్నచేపలను గద్దలు తింటూఉంటే బాధగాను ఆశ్చర్యంగానూ ఉంది.

ఈసముద్రపుటొడ్డున చేపలను పట్టే జాలర్లు ఉంటారు. వాళ్ళ దగ్గర వలలు ఉంటాయి. చిన్నచిన్న బోట్లమీదకెక్కి బలంగా వల విసురుతారు. చిన్న చిన్న చేపలూ పెద్ద చేపలూ వల ఉందని తెలియక ఈదుతూ నాచూ పీచూ తింటూ పిల్లలను చూసుకుంటూ పరుగెత్తుతూ ఉంటాయి. వలలో ఈచేపలు పడగానే వల బరువెక్కినట్లవుతుంది. జాలరి వలను బలంగా వెనక్కి లాగుతాడు. ఒడ్డుకు చేరుకున్నతరువాత మెల్లగా లాగి ఇసకమీద కుమ్మరిస్తాడు. అవి నీళ్ళల్లో తప్ప నేలమీద పాకుతూ వెళ్ళలేవు. కుప్పలోనుంచే ఎగురుతూ ఉంటాయి.

ఒడ్డున బుట్టలతో మాలక్ష్మి వంటివాళ్లు కూర్చుంటారు బేరంచేసి కొనుక్కోవటానికి. జాలరుల ఇంటివాళ్లు కుప్పలదగ్గర కూర్చుని, వాటిలోనుంచి చిన్న చిన్న చేపలను పెద్దచేపలనుండి వేరుచేసి, విడిగా కుప్పచేస్తారు. ఈ చిన్న చిన్న చేపలను మాలక్ష్మివంటివాళ్లు కొనుక్కొని గద్దలకు ఆహారంగా ఇళ్ళ ముందరకొచ్చి అమ్ముతారు. పెద్దచేపలను తినేవాళ్ళకు వాటినీ అమ్ముతారు జాలర్లు. ఈ గంపలవాళ్లే వాటినీ కొనుక్కుపోతారు" తల్లి వివరించింది.

అట్లా వివరంగా చెబితేగాని మాలతి ఊరుకోదు. తల్లీ తండ్రీ ఎంతపనిలో ఉన్నా విసుక్కోకుండా చెప్పవలసిందే.

"ఈ చిన్నచిన్న చేపలనుకొని గద్దలకు వేస్తారా ? వాటిని చంపితే పాపమంటావు కదమ్మా ?

"పాపమంటే అన్నింట్లో పాపంకాదు. గద్దకు చేపలు ఆహారం. ఇష్టమైన ఆహారం. గద్ద అంటే గరుత్మంతుడిజాతి. గరుత్మంతుడంటే మహావిష్ణువుకి వాహనం. ఈ గద్దలకు ఆహారంవేస్తే గరుత్మంతుడికి ఆహారంవేసినట్టే. ఈ ఆహారం గద్దలకువేస్తే చాలా పుణ్యమని పెద్దలంటారు. పండుగరోజుల్లో తట్టల కొద్దీ చేపలు ఖర్చవుతాయి. గుడిలో కొబ్బరికాయ కొట్టినట్టే చేపలను గద్దలకు వేస్తారు. ఈ ఊరు కొత్తగా వచ్చినవాళ్లు తప్పకుండా వేయిస్తారు. ఇది పుణ్యకార్యమనుకుంటారు. పండుగరోజుల్లో వీటికి చాలా గిరాకీ ఉంటుంది."

మాలతి వీధిలోకి వెళ్ళి చిన్న చిన్న చేపలను కుప్పగాపోసినచోట నిలబడి చూసింది. చిన్న చిన్నవి చచ్చిపోయి మట్టిలో కలిసిపోయాయి.

మాలతికి ఊహ తెలిసీ తెలియని వయసు. అన్నీ తెలుసుకోవాలన్న కుతూహలమూ, అన్నీ చూడాలన్న ఉబలాటమూ ఎక్కువ.

ఆ చేపల గంపను పిలిచే వరకూ ఆమె మనసూరుకోలేదు. చేపలను వీధిలో కుమ్మరించగానే గద్దలు ముసురుకోవటాన్ని ఆశ్చర్యంతో చూసింది. అరగంట లోపల రెండు రూపాయల చేపలను గద్దలు గబగబా ఖాళీచేయటం వింతగా కళ్లు పెద్దవిచేసుకుని చూసింది. గద్దలు నోటకరచుకుని తీసుకుపోతుంటే చేపలు ఒక మాదిరి శబ్దంచేస్తాయి. పాపం నొప్పేమో అని బాధపడ్డది. చేపలనన్నిటినీ, గద్దలు తినేశాయనుకోగానే కన్నీళ్ళొచ్చాయి.

"అమ్మా చేపల్ని తినేశాయి" అన్నది కళ్ళుతుడుచుకుంటూ. కళ్ళతోచూస్తే బాధ కలిగింది. కాని చూడాలన్న కుతూహలాన్ని అణచుకోలేకపోయింది. కొద్ది సేపు ఏడ్చి ఆ చాపమీదనే నిద్రపోయింది.

"పిచ్చిపిల్ల చేపలను వేయించేవరకూ ఊరుకోలేదు. పోనీ అడిగింది కదా అని మాలక్ష్మిని పిలిచి వేయిస్తే, ఆచేపలను గద్దలు తింటుంటే ఏడ్చింది. పసి మనసు. చీమచస్తే దోమను చంపితే ఏడుస్తుంది ఎట్లా బతుకుతుందో?" అనుకుంటూ లోపలికి తీసుకువెళ్ళి మంచమ్మీదపడుకోబెట్టి బట్టకప్పింది వెంకటలక్ష్మి. తల్లీ తండ్రి మాలతంటే ఎంతోగారాబంగా చూసుకుంటారు. ఆమె ఆడిందేఆట పాడిందేపాట.

బందరు పట్టణానికి సమీపంలో సముద్రం ఉంది. ఈ రేవుపట్టణంలో ఒకప్పుడు ఓడల మీద సరుకుల వ్యాపారం జరిగేది. వర్తకులతో రేవునిండి ఉండేది. సరుకు ఓడలలో ఉండగానే వర్తకులు బేరాలుచేసి కొనేవారట. బందరు నుంచి హైదరాబాదులో గోలకొండ వరకూ ఒక రస్తా ఉండేదనీ దానికి చల్ల రస్తా అని పేరనీ చెప్పుకునేవారు. ఈ రస్తాద్వారా సరుకుల ఎగుమతీ దిగుమతీ జరిగేవని ప్రతీతి. బందరుచుట్టుపక్కల పంటలు బాగా పండుతాయంటారు. ఆ పొలాలకు ధరలు ఎక్కువని వాడుక. బందరు దగ్గర చిలకలపూడిలో దేవాలయమొకటి ఉందని ప్రజలు రథోత్సవాలకు వెళ్లుతూ ఉంటారు. ప్రతి

పున్నమినీ పర్వదినంగా భావించి పూజలుచేస్తూ ఉంటారు కోవెలలో. సముద్ర స్నానాలకు ప్రజలు దూర ప్రదేశాలనుండి కూడా వస్తూ ఉంటారు.

బందరు మరొకవిధంగా కూడా ప్రశస్తిపొందింది. ఆంధ్రదేశంలో జాతీయోద్యమం మొదట అక్కడే ప్రారంభమయిందని కొందరు జాతీయ వాదు లంటూ ఉంటారు. నేషనల్ కాలేజి కృష్ణాపత్రిక ఆసందర్భంలోనే ఉద్భవించా యని కొందరంటారు.

మాలతి తండ్రి భాస్కరరావు ఆ ఉద్యమంలో పనిచేస్తూ ఉండేవాడు. రాట్నంమీద వడికిన నూలుతోనేసిన వస్త్రాలనే ధరించేవాడు. ఆయన జాతీయోద్యమాన్ని గురించి పాటలురాసి పాడేవాడు.

"నాన్నా, నీబట్టలు గుచ్చుకుంటాయి" అనేది మాలతి.

''నీవుకూడా ఇవే వేసుకోవాలి!'' అని తండ్రి అనేవాడు. అప్పుడు "ఛీ. లావుగా మొద్దుగా ఉంటాయి" అనేది.

మంచమ్మీద పడుకుని నిద్రపోతున్న మాలతికి కలలో చిన్న చిన్నచేపలు ఎగురుతున్నట్టు కనబడ్డాయి. వాటికంటి మిలమిలలుచూసి ఆనందిస్తోంది నిద్రలో. రాసులుగా పోసిన ఆ చిన్న చేపలు ఎగుర్తున్నాయామెకలలో.

గంట తరువాత నిద్రలేచింది మాలతి. తల్లి పాలూ బిస్కెట్లు ఇచ్చింది. చేపలను గురించి ఆలోచిస్తూ బిస్కెట్లు తింటోంది.

ఆ చిన్నచేపల రాసులను మళ్ళీ చూడాలనిపిస్తోందామెకు. అవి కళ్ళల్లో మెదులు తున్నాయి.

'వాటిని చూడటమెట్లా ?'

'సముద్రపు టొడ్డుకు ఎవరు తీసుకువెళ్తారు ?'

'అమ్మనడిగితే తీసుకెళ్ళదు. నాన్నకోప్పడతాడు.'

గంగ, మాలతియింట్లో పనిమనిషికూతురు. మాలతి ఈడుదే ఎప్పుడైనా తల్లి పనిచేసేచోటికి వస్తూ ఉంటుంది. మాలతితో ఆడుకుంటూ ఉంటుంది.

తల్లి పడుకుని ఉండగా తలుపుదగ్గరగా వేసి గంగయింటికి వెళ్ళింది.

మాలతి యింటికి గంగ ఇల్లు చాలా దగ్గర. ఇంచుమించుగా యింటివెనకే ఉంటుంది.

మాలతి వెళ్ళేసరికి గంగ కుండలు కడిగి బోర్లా వేస్తోంది.

"మీ అమ్మ లేదా ?" అడిగింది మాలతి.

"లేదు ఎవరింట్లోనో బియ్యం బాగుచేయటానికి వెళ్ళింది. ఇప్పుడేరాదట."

"గంగా చిన్న చిన్న చేపల రాసులు సముద్రపుటొడ్డు దగ్గరుంటాయట, నీవుచూశావా ?"

"లేదు నాకూ చూడాలని ఉంది కాని ఒక్కదాన్నీ ఎట్లా వెళ్తాను ?"

"సముద్రమెక్కడుందో ? దారితెలుసా ?"

"ఈ వీధి వెంబడి పోతే అదేవస్తుందని అమ్మ ఎప్పుడో చెప్పింది."

"చాలాదూరమా ?"

"ఎంతోదూరముండదు. ఉంటే చేపలమ్ముకునే వాళ్లు నడిచి ఎట్లా వస్తారు ?"

"అయితే మనం వెళదామా ? చూసి వచ్చేద్దాం"

"పొద్దున్నే చీకటితో పోతే చూసిరావచ్చు."

"అంతచీకటిలో పద్దులే, నేను రొట్టె పాలు తిని వస్తాను. నీవు కూడా ఏదయినా తిని తయారుగా ఉండు. రేపే వెళ్దాము."

సరేనసుకున్నా రిద్దరు.

మాలతి గళ్ళగౌను వేసుకుంది. పాలు రొట్టె తినటమయిన తరువాత ఎప్పుడో తండ్రి యిచ్చిన రూపాయలు మూడు జేబులో వేసుకుంది. కాళ్ళకు చెప్పులు వేసుకుంది. రెండు జడలూ రిబ్బన్లతో సహా సరిగా ఉన్నాయోలేదో చూసుకుంది. తల్లి లోపల ఉన్నప్పుడు ఏడు గంటలవేళ - గంగ యింటికివెళ్ళి ఆమెను తీసుకొని బయలుదేరింది.

గంగకు కొంతదూరంవరకూ దారితెలుసు. ఇద్దరూ నడుస్తున్నారు చేతులు

పట్టుకుని. వాళ్ళకు కూరగాయలతట్టలవాళ్ళు ఎదురుపడ్డారు. సముద్రానికి దారి ఎటని అడిగితే ఇటేనన్నారు.

ఇద్దరూ నడవటం మొదలుపెట్టారు.

కొంతదూరం వెళ్ళేసరికి ఇద్దరికీ బాగా కాళ్ళు నొప్పులు పుట్టాయి. ఆకలయింది. "హోటలుందా ఇక్కడని'' గంగ దుకాణాల దగ్గరకెళ్ళి అడిగింది. ఆఖరి దుకాణం పక్కన ఉన్నదని ఎవరో చెప్పారు. అక్కడికివెళ్ళి ఇడ్లీ తిన్నారు. "కాఫీ తాగుతావా" అని గంగ అడిగింది. గంగకిప్పించి తను మంచినీళ్లుతాగింది, మాలతి. హోటలువాళ్ళకు డబ్బుఇచ్చి బయటికి వచ్చారు ఇద్దరూ.

కాళ్ళనొప్పివల్ల నడవలేకపోయింది మాలతి. దారిలో ఒక రాతిమీద కూర్చుంది. తట్టలు నెత్తిమీద పెట్టుకుని ఇద్దరాడవాళ్ళు వెళ్ళుతుంటే, గంగ వాళ్ళతో వెళ్ళాలని "నీవు వెనకనుంచివస్తావా ?" అని అడిగింది.

రాతిమీద కూర్చున్న మాలతికి నడకవల్ల బాగా అలసటగా ఉండి వెళ్ళలేకపోయింది. కళ్లు మూతలుపడ్డాయి. రాతిమీద కూర్చుని కునికిపాట్లు పడటం మొదలుపెట్టింది.

"తట్టలవాళ్లు ఇంకా వస్తారు. నీవు అలుపు తీర్చుకుని వాళ్ళతోరా" అంటూ గంగ వాళ్ళతో వెళ్ళింది. మాలతి ఆ రాతిమీద కూర్చుని కునికిపాట్లు పడుతూ ఎప్పుడో రాతిమీదనుంచి కిందికి జారిపోయింది.

అక్కడికి కాస్తదూరంలో కూరలు అమ్ముకుని ఇంటికి వచ్చిన మనిషి మాలతి కిందపడి నిద్రపోవటంచూసి లేపి పక్కనే ఉన్న తనయింటికి తీసుకువెళ్లి ఈతాకుల చాపవేసి పడుకోబెట్టింది.

కొంతసేపటికి మాలతి లేచింది. ''తనెక్కడుంది!'' కళ్లు తెరిచి పడుకున్న చోటినుంచి లేచి వీధి వాకిలివైపు చూసింది. అంతాకొత్తగా ఉంది. తలమీద ఏదో బరువుపెట్టినట్టుగా ఉండి నొప్పిపెట్టటం మొదలు పెట్టింది.

స్థలం కొత్తగాఉంది. తనెక్కడుందో తెలియదు. పైగా విపరీతమైననొప్పి భరించలేకుండా ఉంది. ఏడవటం మొదలు పెట్టింది.

అన్నంతిని బైటికి వచ్చిన కూరగాయల కోటమ్మ ''ఏంది పాపా !ఏడుస్తుం

డావు ? నీవు రాతిమీదినుంచి కిందపడి నిద్రపోయినవ్. ఆకలేస్తుందా ? వణ్ణం పెట్టనా ?'' కూర్చోబెట్టి కళ్ళు తుడిచింది.

అంతలో ఆమె పెనిమిటి శాయన్న వచ్చాడు.

''ఈ పిల్లెవరు ఏడుస్తుండాది ?'' ప్రశ్నించాడు భార్యను.

కోటమ్మ తనకు తెలిసినంతవరకూ చెప్పి" నిద్రలేచి ఏడుస్తుండాది. ఇంత వణ్ణం మజ్జిగలో పిసికి నోట్లో పోద్దామనుకొంటున్న'' అని సత్తుగిన్నె తెచ్చి గరిటతో నోట్లో పొయ్యటం మొదలుపెట్టింది.

పోసినదంతా తాగి గోడకానుకుని కూర్చుంది మాలతి. కళ్లనీళ్ళు కారుతున్నాయి. అసలే ఎర్రటి ముఖం - మరింత ఎర్రగా అయింది. ఏడ్చి ఏడ్చి కళ్ళుముఖం వాచినట్లయింది.

మాలతి ముఖం చూస్తే జాలేస్తున్నది.

"ఏమయింది పాపా చెప్పు ?'' ఇద్దరూ దగ్గరకూర్చోబెట్టుకుని అడిగారు.

మాలతి - ఏడుపు మరీఎక్కువై వెక్కిళ్ళు వస్తుండగా ''సముద్రపుటొడ్డున చిన్నచేపల్ని చూడటానికి గంగతో వెళ్లుతుంటే కాళ్ళు నొప్పులు పుట్టాయి. దారిలో ఇడ్లీ తిన్నాము. నేను నడవలేక ఈ రాతిమీద కూర్చున్నా. నాతో వచ్చిన స్నేహితురాలు గంగ, "చాలామంది వస్తూ ఉంటారు. కాళ్ళ నొప్పులు తగ్గిన తరువాత వాళ్ళతో రా నేను ఇంటికి వెళ్తాను" అని వెళ్ళిపోయింది. ఇప్పుడు నేనెట్లా వెళ్లను ?" వెక్కిళ్ళుపడుతూ ఏడ్చింది.

"ఇంతదూరం నన్ను తీసుకువచ్చి వదిలిపెట్టి వెళ్ళిపోయింది.'' కళ్లు తుడుచుకుంది మాలతి.

మాలతి ఏడుస్తుంటే వాళ్ళిద్దరికీ ఏమీ తోచలేదు.

"ఇప్పుడు సాయంత్రమయిపోనాది. ఈ రాత్రికిక్కడతొంగో. రేపు పొద్దవేళ నేను తీసుకుపోతా మీయింటికి" అన్నాడు. వాళ్ళకు పిల్లలు లేరు. పిల్లలను చూస్తే ముద్దు.

మాలతి మాట్లాడలేదు

''మీయిల్లు ఏడుందో గురుతు పడతవా పాపా ?''

"అఁ"

తెల్లవార్లూ మాలతి నిద్రపోలేదు. గోడకానుకుని కూర్చుంది. ''వీళ్ల నన్ను ఇంటికి చేర్చగలరా ? ఆ వీధి ఆనందు తను బాగా గుర్తుపట్టలేదు. అయినా వెళ్లాలి. తిరిగి తిరిగి అయినా అందరినీ అడుగుతూ వెళ్ళి నాన్నా అమ్మా చెల్లెలూ ఉన్న చోటికి వెళ్ళాలి'' అనుకుంటూ కూర్చునే నిద్రపోయింది.

తెల్లవారగానే పాపకోసం కొంతదూరం నడిచి పాలు బ్రెడ్ కొనుక్కొచ్చాడు అతడు.

"పాపా ముఖం పళ్ళు తోముకొని ఇవితిను. మీయింటికాడ ఇడిచివస్త" అన్నాడు.

పాప ముఖంకడిగి పాలు బ్రెడ్‌తిని తనదగ్గరున్న రూపాయను ఆ గుడిసెలో ఉన్న అమ్మికి ఇచ్చింది. "వెళ్తున్నా'' అని చెప్పి అతడి సైకిల్‌మీద కూర్చుంది.

''ఎటుపోవాలి పాపా ?'' అడిగాడు.

''తిన్నగా పోవాలి."

రోడ్డుమీద సైకిల్‌ని తిన్నగా పోనిచ్చాడు. మధ్యాహ్నం పదకొండు గంటలయింది.

"పాపా మీయిల్లు ఎటు ? చూపు'' అన్నాడు.

ఇటూ అటూ చూసింది. ఎటుచూసినా తనకు తెలిసిన ఇళ్లుగాని పరిసరాలు గాని కనబడలేదు.

"ఈ వీధికాదు ఇక్కడ మాయిల్లులేదు."

''మరెటు ఉండది మీ యిల్లు" అడిగాడు.

"పక్కవీధికి తీసుకెళ్ళు."

పక్కవీధికి తీసుకెళ్ళాడు. అది కాదంటే ముందువీధికి తీసుకెళ్ళాడు.

మాలతికి ఏడుపొస్తోంది. ఎంతదూరంపోయినా ఎన్నివీధులు తిరిగినా వాళ్ళయిల్లు రాలేదు.

"నీతో కూడా ఒకపిల్ల వచ్చినాదంటివే. ఆ పిల్లఇల్లు ఎక్కడ ?'' ఓపికతో వీధులన్నీ తిప్పి చివరకు అడిగాడు.

''మాయింటిదగ్గర"

అతడు హతాశుడైనాడు. తమయిల్లే తెలియదు. కాని ఆపిల్ల యిల్లు తమ యింటిదగ్గరంటోంది.

''మీ నాయనపేరు చెప్పు ?''

అడిగాడు చివరకు.

చెప్పింది.

''నిన్ను ఇక్కడ దిగవిడుస్త. ఆయింటికిపోయి అడుగు" అని సైకిలు మీదినుంచి దింపాడు.

మాలతి రెండుమూడు ఇళ్ళల్లోకి వెళ్ళి అడిగింది.

''ఆపేరు మేము వినలేదమ్మా ఏ బజారులో ఉన్నదో తెలియదు."అన్నారు. మాలతి ఏడుస్తూ చెప్పింది బైటకివచ్చి.

అతడు సైకిల్‌ని వెనక్కు తిప్పి చౌరస్తాకు ఎదురుగా ఉన్నయింటికి తీసుకు వెళ్ళాడు. ఆయిల్లు కాదంది.

''అతడికొక ఆలోచన వచ్చింది. పోలీసుస్టేషన్‌కి తీసుకెళ్తైనో ?''అని వెంటనే అక్కడికి తీసుకెళ్ళాడు.

"ఆదొరకు మీ అయ్య పేరుచెప్పు. ఆళ్ళకు తెలుసుద్ది.'' అన్నాడు. అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళి "చెప్పు ? అన్నాడు.

"నీ పేరు" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"మాలతి".

"నీవెవరి అమ్మాయివి ? మీ నాన్న పేరు ?"

''వెంకటేశ్వరరావు''

"ఏం ఉద్యోగం చేస్తాడు ?''

"తెలియదు"

''నీవు చదువుకుంటున్నావా ?

"అవును''

''నీ స్కూలెక్కడ ?"

''మా యింటి దగ్గరనుంచి తిన్నగాపోతే ఎత్తుగా గోడలుంటాయి. ఎర్ర పూలచెట్టు గేటుమీదుగా పాకుతుంది. ఆడుకోటానికి చాలాచోటుంది. లోపలికి పోతే చివరికుంది మాక్లాసు" అంది.

"మీ స్కూలు పేరు?''

తన తడుముకుంది గాని స్కూలు పేరు జ్ఞాపకానికి రాలేదు.

ఆ ఇన్స్పెక్టరు చాలా చికాకు మనిషి, "ఈ అమ్మాయి తెలిసి చెప్పటం లేదా లేక తెలియక చెప్పటంలేదా ? చిన్నపిల్లలు అడగంగానే గబగబా చెప్పేస్తారు. స్కూలుకు వెళ్ళేపిల్ల ఆ మాత్రం చెప్పలేదూ ?' అనుకున్నాడు.

"మేము కూడా తెలుసుకుంటాము. ఈ ఊళ్ళో తెలుసుకోపటం ఏమంత కష్టంకాదు. కాని, ఈ అమ్మాయి సరిగా చెప్పటంలేదు. అసలు ఈ అమ్మాయి నీకు ఎక్కడ కనబడ్డది ? నీ యిల్లెక్కడ ? నీవేంచేస్తూఉంటావు ?"

అతడు, భార్య తనకు చెప్పినంతవరకూ చెప్పాడు. తనసంగతి-తనొక దుకాణంలో పనిచేస్తాననీ భార్య కూరలమ్ముతుందనీ చెప్పాడు.

"సరే నీ అడ్రసు రాసుకున్నాను. నేను ఈమె తండ్రి సంగతి తెలియగానే నీ దగ్గరికి మనిషిని పంపుతాను. అంతవరకు ఈ అమ్మాయిని నీ యింట్లోఉంచుకో. నీకు ఖర్చులు ఇప్పిస్తాము" అన్నాడు.

అప్పటికి పన్నెండయింది. పిల్లకూ తనకూ ఆకలికూడా వేస్తున్నది. పిల్ల ముఖం వాడిపోయింది. ఇంటికిపోతేనే మంచిదనిపించింది. మాలతిని సైకిల్ మీద కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకువెళ్ళాడు. భార్యను పిల్లను జాగ్రత్తగా చూసుకోమని

చెప్పి భోజనంచేసి వెళ్ళిపోయాడు. యజమానిచేత చివాట్లుతినాలనుకుంటూ కోటమ్మ అన్నంపెట్టగానే ఎండలో తిరిగి అలిసిపోయిన మాలతి పడుకుని నిద్రపోయింది.

అక్కడ వెంకటలక్ష్మి నిద్రలేచి మాలతికోసం చూసింది. మాలతి ఆ గదిలోలేదు లేచిచూస్తే వాకిలితలుపు దగ్గరగావేసిఉంది.

ఆ సాయంత్రం పనిమనిషి వచ్చినప్పుడు మాలతిసంగతి అడిగితే-తను చూడలేదనిచెప్పి తనపని చేసుకునివెళ్ళింది ఆమె ఇరుగుపొరుగుల ఇళ్ళల్లో అడిగింది. అక్కడా మాలతిసంగతి తెలియలేదు. దారిలో గంగ కనబడ్డది. మాలతి సంగతి అడగ్గానేచెప్పింది. తన దగ్గరకొచ్చి, రేపు చిన్నచేపలను చూడటానికి సముద్రానికి పోదామన్నదని తననుకూడా రమ్మన్నదనీ చెప్పింది.

''మీరు చిన్నపిల్లలు మీరు సముద్రానికి వెళ్ళటిమేమిటి? వెళ్ళకండి. మీరు తప్పిపోతే మేమువెతకాలి'' అన్నది కోపంతో వెంకటలక్ష్మి.

తెల్లవారగానే నీళ్ళకాగు పొయ్యిమీదపెట్టి కాఫీచేసి పసిపిల్లసంగతి చూసుకుని స్నానాలకు ఏర్పాట్లుచేస్తుండగా

చిన్నపిల్లకు స్నానంచేయించి మాలతిని పిలవగానే రాలేదు. అప్పుడే అనుమానంవచ్చించి భయపడుతూనే పనిమనిషిని అడిగింది.

''మా గంగను పంపిస్తా అడగమ్మా'' అది వెళ్ళిపోయింది.

వెంకటేశ్వర్రావు జాతీయోద్యమంలో పనిచేస్తూ ఇటూ అటూ తిరిగి తిరిగి ఎప్పుడో ఇంటికివస్తాడు. మరునాడు టంగుటూరి ప్రకాశంగారు వస్తారనీ కృష్ణాపత్రికాఫీసులో సమావేశమనీ అందరిళ్ళకూ వెళ్ళిచెప్పాలి. ఆ పనిమీద తొందరగా వెళ్ళిపోయాడు.

మాలతికోసం చూసిచూసి భోజనం చేయకుండా గంగ యింటికి వెళ్ళింది వెంకటలక్ష్మి. అక్కడ ఇద్దరూలేరు. ఇంట్లో పనిమనిషిలేదు ఇద్దరు పిల్లలెవరో వాకిట్లో ఆడుకుంటున్నారు.

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికివచ్చి పిల్లకు పాలుపట్టి ఏంచేయాలా అని ఆలోచిస్తోంది. మధ్యాహ్నమయింది రాత్రికూడా అయింది వెంకటేశ్వరరావు రాత్రి పది గంటలవేళవచ్చాడు భోజనానికి.

వెంకటలక్ష్మి ఏడుస్తూ మాలతిసంగతి చెప్పింది. ''ఇంటికి రాగానే ఏదో చెప్తావ''ని విసుక్కుంటూ పనిమనిషి ఇంటికివెళ్ళి అడిగాడు. గంగ నిద్రలోనుంచి లేచి మాలతి దారిలోపడిపోతే తనొక్కతే వెళ్ళి వచ్చానని భయపడుతూచెప్పింది.

ఆ రాత్రంతా ఇద్దరికీ నిద్రలేదు.

''ఇద్దరు పిల్లలను చూసుకోలేక పోయావు. ఇప్పుడేడిస్తే ఏంలాభం? నేనెప్పుడూ ఇల్లు కనిపెట్టుకుని కూర్చుంటానని ఎట్లా అనుకున్నావు?'' అన్నాడు వెంకటేశ్వరరావు మండిపడుతూ.

అసలే బాధపడుతున్న వెంకటలక్ష్మికి అతడిమాటలు మరింత బాధ కలిగించాయి. "అందులో మాలతి ఇటు పిలిస్తే అటుపోతుంది. ఇంటిపనితో పిల్లలపనితో రాత్రింబగళ్లు తను సతమతమయి పోతున్నది. పిల్లలబాధ్యత తనకుమాత్రంలేదా? ఏ రాత్రివేళకోవచ్చి పిల్లలను సరిగా చూసుకోవటంలేదని తనను తప్పుపట్టకపోతే తండ్రి అయిన మనిషి రోజూ సాయంత్రపువేళ మాలతిని అట్లా బయటకి తీసుకు వెళ్ళి ఒక గంటసేపు తిప్పి తీసుకురాకూడదా?'' వెంకటలక్ష్మికి ఆ బాధలో అభిమానం ముంచుకుంటూ వచ్చింది.

"అమ్మాయి కనబడటంలేదంటే బయటికివెళ్ళి వెతకటానికిబదులు పిల్లలను చూసుకోలేవా అని అంటున్నారే? నేను పగలంతా ఈ చిన్నపిల్లను ఎత్తుకుని ఎట్లా వీధులన్నీ తిరిగి తిగిరి వచ్చానో మీకు తెలుసా? చేను వెతక్కుండానే మీకు చెప్పానా? ''ఈ చీకట్లో వీధిదీపాల వెలుగులో ఎక్కడని వెతకను?" అని మీరు విసుక్కున్నారు? కాని నేనట్లా విసుక్కుంటే ఈ పిల్లలు ఎట్లా పెరుగుతారు అన్నాళ్ళు?"

మాలతి కనబడలేదన్న బాధ ఇద్దరినీ బాధిస్తున్నది. ఆ బాధలో నీది తప్పంటే నీదని వాదులాడుకుంటూ ఉండగా తెల్లవారింది.

వెంకటలక్ష్మి కళ్ళు తుడుచుకుంటూ లేచి ముఖం కడుక్కుని కాఫీ చేసింది. వెంకటేశ్వరరావు సైకిల్‌మీద మళ్ళీ బయలుదేరాడు. తిరిగిన వీధే మళ్ళీ తిరిగాడు. ఎదురయిన మనిషినల్లా ''ఆరేడేళ్ళపిల్ల ఎక్కడయినా మీకు కనబడ్డదా?'' అని అడుగుతూ వెళ్ళాడు. పిల్ల కనబడలేదన్న వ్యధ-బయట తన పనంతా పాడయి పోతున్నదన్న ఆరాటం-ఇది రెండూకలిసి వెంకటలక్ష్మి మీద కోపాన్ని అధికం

చేస్తున్నాయి. దారిలో నడిచేవాళ్ళమీద తన సైకిల్‌కి అడ్డంవచ్చారని కోప్పడ్డాడు. పడుకున్న ఒక కుక్కకాలిమీదుగా సైకిల్‌ని పోనిచ్చాడు.

అంతలో ''మా నాన్న అడుగో'' అన్న మాలతి మాటలు వినబడ్డాయి.

సైకిల్‌మీదినుంచిదిగి నిలబడి ఇటూ అటూ చూస్తున్నాడతడు.

''ఈ పాప మా యింటికాడ రాతిమీద కూకుండి ఏడుస్తాఉంటే మా ఆడది లోనకు తీసుకెళ్ళి వణ్ణంపెట్టి చాపమీద పండేసిందట. లేచినంక మళ్ళీ ఏడుపు మొదలుపెట్టినాది. ఊరంతాతిప్పి ఇల్లుచూపించమని అడిగిన తెలవదని ఏడుస్తున్నది. ఇప్పుడీ ముగంచూడండి ఎట్లా యెలిగిపోతున్నదో?" అంటూ ఆకిందటిరోజు సంగతంతాచెప్పాడు మాలతివి సైకిల్‌మీద ఎక్కించుకునివచ్చిన శాయన్న.

''ఈ పాపకోసమే నేను వెతుకుతున్నాను. నీలోమంచితనముంది కనుక మా పిల్లను మాకు ఒప్పగించాలని ఊరంతా తిప్పుతూ తీసుకువచ్చావు. నీకూ పిల్లలున్నారా?'' అని అడిగాడు మాలతిని దగ్గరికి తీసుకుంటూ.

''లేరు బాబయ్యా నేనూ మాఆడదీ పాలుఇచ్చి రొట్టెఇచ్చి ఊరుకోబెట్టాలని చూసినాముబాబూ....ఒకటేఏడుపు ఇంటికి పోతానని'' అన్నాడు మాలతిని తండ్రికి ఒప్పగించగలిగానన్న సంతోషంతో.

"మీ రిద్దరూ చాలా శ్రమపడ్డారు. ఇంట్లో తల్లిపిల్లకోసం ఏడుస్తున్నది. ఈ పది రూపాయలుంచుకో" అంటూ జేబులోనుంచి తీసిఇచ్చాడు.

"దణ్ణాలుబాబూ పాపా యెళ్తాను" అంటూ అతడు వెళ్ళిపోయాడు.

"ఎక్కడికెళ్లావమ్మా, నిన్నటినుంచీ వెతుకుతున్నాము నీకోసం? అమ్మకు చెప్పి వెళ్ళకూడదూ? ఇంతకూ ఏంచూశావు?" అని మాలతి బుగ్గలునిమిరి సైకిల్ మీద కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకువచ్చాడు.

రాత్రంతా నిద్రలేక పీక్కుపోయిన ముఖంతో తడబడే కాళ్లతో వెంకటలక్ష్మి మాలతినిచూడగానే "ఎక్కడికెళ్ళావమ్మా చెప్పకుండా?" అంటూ రెండు చేతులతో దగ్గరికి తీసుకుని ఊపిరాడకుండా ముద్దులుపెట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

తను ఎంత ఆదుర్దాతో వెతికినా కనబడిని మాలతి అతడికి ఎంత తొంద

రలో దొరికిందోనని మనసులో సంతోషంగాఉన్నా పైకి కనబడనీయలేదు వెంకటలక్ష్మి. కాని-వెంకటేశ్వరరావు "నీవు అశ్రద్ధతో పిల్లలను సరిగా చూడకుండా వదలిపెట్టావు. నేను కష్టపడి వెతికితీసుకువచ్చానన్న" గర్వంతో భార్యనుచూస్తూ ''నాకోకప్పు కాఫీతీసుకురా నీ కూతుర్ని వెతుక్కొచ్చినందుకు'' అన్నాడు.

అమ్మాయి కంటికి కనబడ్డదన్న సంతోషంతో ఊరుకుందిగాని మామూలుగా అయితే వెంకటలక్ష్మి అతడు అట్లా గర్వపడుతుంటే చూస్తూ ఊరుకుంటుందా? ఒంటికిమంచిది కాదంటుంది.